ప్రజాశక్తి
ఆదివారం 22 డిసెంబర్ 2024
5
కర్నూలు





అభివాదం చేస్తున్న టిడిపి నాయకులు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు

ఉచితంగా న్యాయ సేవలు

- హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మధరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మానసిక విభిన్న ప్రతిభావంతులకు ఉచిత న్యాయ సేవలు అందించినట్లు రాష్ట్రహైకోర్ట్ జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి (కర్నూలు, నంద్యాల) జస్టిస్ డాక్టర్ కె.మన్మధరావు తెలిపారు. శనివారం కర్నూలు ప్రకాష్ నగర్‌లోని అంబికా శిశు కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ డాక్టర్ కె.మన్మధరావు మాట్లాడుతూ... మానసిక, విభిన్న ప్రతిభావంతుల సంరక్షణ కోసం స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం 2005 గురించి వివరిస్తూ, వారందరికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ట్రస్ట్ వారు చేసే సేవ కార్యక్రమాలను కొనియాడారు. ఈ సంస్థలో ఒక్కరు కాదు ఇంతోమంది మానసిక విభిన్న ప్రతిభావంతులకు సేవలు అందచేస్తున్న అంబికా శిశు కేంద్రం వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సేవలు నిరంతరం ఇదే విధంగా కొనసాగించాలని కోరారు. 7వ అదనపు జిల్లా జడ్జి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎటువంటి స్వార్థం లేకుండా, డబ్బు మీద ఆశ లేకుండా సేవలు అందించే సంస్థ అంబికా శిశు కేంద్రమన్నారు. బ్యాగ్‌లు, బుక్ బైండింగ్, టైలరింగ్, ప్యాకింగ్, ప్రింటింగ్ తదితర నైపుణ్యాలను హైకోర్టు న్యాయమూర్తులు పరిశీలిస్తూ తయారు చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి జస్టిస్ బివిఎల్ఎన్.చక్రవర్తి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, అదనపు జిల్లా జడ్జీలు జి.భూపాల్‌రెడ్డి, పి.పాండురంగారెడ్డి, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు రాయిస్‌ఫాతిమా, అంబికా శిశు కేంద్రం ట్రస్ట్ దిలీప్ కుమార్ హెచ్.షా, హేమచంద్ దేవ్‌చంద్ ఛారిటీస్ ట్రస్ట్, విఆర్‌పి శైలజారావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



కర్నూలులోని ప్రకాష్ నగర్‌లో శిశు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్జి మన్మధ రావు

జూనియర్ సివిల్ కోర్టుకు రెగ్యులర్ జడ్జిని నియమించాలి

-బార్ అసోసియేషన్ అధ్యక్షులు రంగస్వామి

పత్తికొండ : పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టుకు రెగ్యులర్ జడ్జిని నియమించాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రంగస్వామి కోరారు. శనివారం కర్నూలు పట్టణంలోని రాష్ట్రహైకోర్టు జడ్జి డాక్టర్ జస్టిస్ కె.మన్మథరావు, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.కబర్ధిలకు పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు రంగస్వామితో పాటు న్యాయవాదులు పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కు రెగ్యులర్ జడ్జిని నియమించాలని వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ... పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎంఎస్ భారతి ప్రమోషన్ పై చిత్తూరు జిల్లాకు వెళ్లారని తెలిపారు. అందువల్ల పది రోజుల నుండి జూనియర్ సివిల్ కోర్టుకు రెగ్యులర్ జడ్జి లేకపోవడంతో న్యాయవాదులు, కక్షిదారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టుకు రెగ్యులర్ జడ్జిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రవికుమార్, సహాయ కార్యదర్శి వాసుదేవ నాయుడు, ఎపిజి నరసింహయ్య, న్యాయవాదులు బాలబాష, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు రంగస్వామి

ప్రాజెక్టు చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవం

- టిబిపి ఎల్ఎల్‌సి చైర్మన్‌గా టిప్పు సుల్తాన్, గాజులదిన్నె ప్రాజెక్టు చైర్మన్‌గా కెఇ.మల్లికార్జున

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

నీటిపారుదల సంఘాల ఎన్నికలు ముగిశాయి. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జలమండలిలో తుంగభద్ర దిగువ కాలువ (టిబిపి ఎల్ఎల్‌సి) గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీల ఛైర్మన్ ఎన్నికలు నిర్వహించారు. టిబిపి ఎల్ఎల్‌సికి ఆథరైజ్డ్ అధికారిగా జలవనరుల శాఖ ఎస్ఇ బాలచంద్రరెడ్డి, గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ ఆథరైజ్డ్ అధికారిగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ లు వ్యవహరించారు. ఈ ఎన్నికలు రెండు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆథరైజ్డ్ అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చారు. టిబిపి ఎల్ఎల్‌సి ఛైర్మన్‌గా టిప్పు సుల్తాన్, వైస్ ఛైర్మన్‌గా అచ్చుగట్ల హుస్సేన్ సాహెబ్, గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌గా కెఇ.మల్లికార్జున గౌడ్, వైస్ ఛైర్మన్‌గా మద్దయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన ఛైర్మన్‌లతో కలిసి టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డిలు అభినందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేరకు ఛైర్మన్ ఎన్నిక ఏకగ్రీవంగా అభ్యర్థిని ప్రకటించామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో నీటి సంఘాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల సమస్యలుతీర్చేలా నీటి సంఘాల ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామన్నారు. రైతులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఎల్లెల్సీ నుండి టిబి డ్యామ్ వాటా తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పుడు ఎన్నికైన డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఛైర్మన్లు ,పిసి ఛైర్మన్‌లు రైతులకోసం పనిచేయాలని కోరారు. ఎన్నికైన ఛైర్మన్‌లను పలువురు నాయకులు అభినందించారు. ఎన్నికల కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, రైతు సంఘం నాయకులు సాయిబాబా, తొమ్మిది కమిటీల డిసి ఛైర్మన్ లు పాల్గొన్నారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

పిఎల్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా విద్యాశాఖ అధికారి శ్యాముల్ పాల్

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్యాముల్ పాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాల్‌ల్యాబ్ లను విద్యార్థులకు బోధించే తరగతి గదిని తనిఖీ చేశారు. తరగతి గది దుమ్ము, దూలి, చెత్తా, చెదారంతో ఉండి కనీస వెలుతురు లేకుండా ఉండడంతో ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు విద్యా బోధనను టెక్నాలజీని సులభతరంగా అర్థం చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పాల్ ల్యాబ్‌లను తీసుకుని వచ్చిందన్నారు. కర్నూలు జిల్లాలో 1460 స్కూళ్లకు గాను వెల్దుర్తి మండలంలో స్థానిక వెల్దుర్తి జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను మాత్రమే ఎంచుకుందని పాల్‌ల్యాబ్‌లను వాడడంలో ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు జిల్లా చిట్ట చివరన ఉందని ఉపాధ్యాయులు పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా విద్యార్థులకు ల్యాబ్‌ల ద్వారా బోధించాలని ఈ బోధన విధానం విజయవంతం అయితే జిల్లాలోని అన్ని పాఠశాలలకు పాల్‌ల్యాబ్‌లను ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని తెలిపారు. అనంతరం పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించే భోజనంలో నాణ్యత ఉండాలని, కట్టేల పొయ్యితో వంట చేయడం వల్ల ఆహారం పొగ వాసన వస్తుందని గ్యాస్‌ద్వారా వంటను చేయాలన్నారు. వంట సరుకులను పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని పలు సూచనలు చేశారు. అనంతరం మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వాటిపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయుడు రామానాయక్, ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ శ్యాముల్ పాల్

అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'అంబేద్కర్..అంబేద్కర్..అంబేద్కర్' అంటూ ఎప్పుడూ ఆయన నామ స్మరణ చేయడం కంటే ఆ దేవుని నామస్మరణ చేస్తే స్వర్గం ప్రాప్తించేది' అంటూ అమిత్ షా అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా అంబేద్కర్‌ను అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేయడం పట్ల జిల్లావ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు, రాస్తారోకోలు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్, మాల మహానాడు, తదితర సంఘాల ఆధ్వర్యంలోనూ నిరసనలు నిర్వహించారు. అమిత్ షా వ్యాఖ్యల పట్ల దళిత సంఘాల నుంచి కూడా ఆగ్రహం వ్యక్తమవుతోంది. అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. టిడిపి, వైసిపి నాయకులు మాత్రం దీనిపై నోరు మెదపలేదు.

వణికిస్తున్న చలి...

ఉమ్మడి జిల్లాలో మొన్నటి వరకు ఆలస్యం అయ్యిందనుకున్న శీతాకాలం ఎట్టకేలకు వచ్చేసింది. వచ్చీరాగానే శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం కూడా కాకముందే వాతావరణం చల్లగా మారిపోతోంది. రాత్రి గడిచేకొద్దీ మరింత చల్లగా మారి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ సమయంలో బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వెచ్చదనం కోసం తపించి పోతున్నారు. జిల్లాలో చలిపులి భయపెడుతోంది. మొన్నటి వరకు కార్తీకమాసం ప్రారంభమైనా ఇంకా చలి ప్రారంభం కాలేదని అందరూ అనుకున్నారు. ప్రస్తుతం చలితో పాటు శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కర్నూలు, కోడుమూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, నంద్యాల, ఆత్మకూరు, బనగానపల్లె ఇలా అన్ని చోట్లా శీతలగాలులు వీస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలకు పడిపోయాయి.

ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు...

ఉమ్మడి జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు ముగిశాయి. తొలి దశలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో 384 సాగునీటి సంఘాలకు గాను 376 సంఘాలకు ఏకాభిప్రాయంతో (ఏకగ్రీవం) ఎన్నికలు జరిగాయి. నంద్యాల జిల్లాలో 8 సంఘాలకు ఎన్నికలు జరగలేదు. సాగునీటి వినియోగదారుల సంఘాల (డబ్ల్యుయుఎ) ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 3,699కు గాను 3,597 ఏకగ్రీవం కాగా నంద్యాల జిల్లాలో 102 టిసిలకు ఎన్నికలు జరగలేదు. కర్నూలు జిల్లాలో 1212 టిసిలకు గాను 1212 ఏకగ్రీవమయ్యాయి. నంద్యాల జిల్లాలో 2487 టిసిలకు గాను 2385 ఏకగ్రీవమయ్యాయి. రెండో దశలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. కర్నూలు జిల్లాలోని 10, నంద్యాల జిల్లాలోని 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరిగాయి. అన్నీ ఏకగ్రీవం కాగా అన్నింటినీ కూటమి నాయకులు కైవసం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో నీటిసంఘాల ఎన్నిక ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కరెంట్ బిల్లులను దహనం చేశారు. జిల్లావ్యాప్తంగా పలు కార్యాలయాలు, చర్చిలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.



ఇవిఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

త్రైమాసిక తనిఖీలో భాగంగా ఇవిఎంలు భద్రపరచిన వేర్ హౌస్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష పరిశీలించారు. శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇవిఎం వేర్‌హౌస్‌లో ఇవిఎం లను భద్రపరచిన తీరును కలెక్టర్ పరిశీలించారు. ఇవిఎం వేర్ హౌస్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గోడౌన్స్‌లోని ఇంటర్నల్ పార్టిషన్లకు ప్రస్తుతం ఉన్న తాళాల కంటే పెద్దతాళాలు వేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. డిఆర్ఒ సి.వెంకటనారాయణమ్మ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మురళి, టిడిపి జనరల్ సెక్రెటరీ ఎల్‌వి.ప్రసాద్, బిజెపి స్టేట్ ఎలక్షన్ సెల్ ప్రతినిధి సాయి ప్రదీప్, వైసిపి ప్రతినిధి కె.పుల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి షేక్ ఇజాజ్ అహ్మద్, బిఎస్‌పి ప్రతినిధి అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోడుమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదిమూలపు సతీష్

ఘనంగా వైఎస్‌జగన్ పుట్టిన రోజు వేడుక

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని 40వ వార్డు కార్పొరేటర్ విక్రంసింహారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు బాలాజీ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి దంపతులు, నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్, కర్నూలు మేయర్ బివై.రామయ్య, కుడా మాజీ చైర్మన్, కోడుమూరు నియోజవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి , కోడుమూరు నియోజవర్గ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్, ముఖ్య అతిథులుగా పాల్గొని వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ఎల్లప్పుడూ పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసే జగనన్న లాంటి మంచి మనసున్న మహారాజు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అన్నారు. కార్యకర్తలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ : వైఎస్.జగన్ పుట్టినరోజు సందర్భంగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యకర్తలకు, పారిశుధ్య కార్మికులకు, ప్రజలకు అల్పాహార కార్యక్రమం ఏర్పాటు చేశారు. 39 వ వార్డు కార్పొరేటర్ సాంబశివరావు, జడ్‌పిటిసిలు మౌలాలి, ప్రసన్న కుమార్, మండల ఉపాధ్యక్షులు నెహమియా, మాజీ మండల ఉపాధ్యక్షులు డి.వాసు, రామకృష్ణారెడ్డి, రేమట సంపత్ కుమార్, గుడిపాడు లక్ష్మీకాంతరెడ్డి, మాజీ ఎల్లమ్మ దేవాలయ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, కురువ మధు పాల్గొన్నారు.



మెడికవర్ హాస్పిటల్ 2025 క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మెడికవర్ హాస్పిటల్ 2025 న్యూ ఇయర్ క్యాలెండర్‌ను తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ప్రెసిడెంట్ శృంగవరపు నిరంజన్ శనివారం ఆవిష్కరించారు. మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి, మార్కెటింగ్ హెడ్ షైక్ ఖాదర్ బాష, ఇతర వైద్య నిపుణులు పాల్గొన్నారు. శృంగవరపు నిరంజన్ మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్ సేవలను మరింత విస్తరించాలని, మెరుగైన వైద్యం ప్రజలకు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. మహేశ్వర్‌రెడ్డి శృంగవరపు నిరంజన్‌కు కృతజ్ఞలు తెలిపారు.

రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

-కాలువ నిర్మించకుండా అడ్డుకుంటున్న అధికారి
-ఇబ్బందుల్లో వీధి ప్రజలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 17వ వార్డు మాంటిస్సోరి పాఠశాల వెనక భరత్‌నగర్‌లో నగరపాలక సంస్థలో పనిచేసిన ఇఇ సురేంద్రబాబు ఇంటి పక్కన రోడ్డును ఆక్రమించి టెంకాయ చెట్లు, పూల మొక్కలు నాటి మురుగు కాలువ నిర్మించకుండా అడ్డు పడుతున్నారు. దీంతో పక్కన కొత్తగా ఇటీవల నిర్మించారు. తన ఇంటి ముందు కాల్వ నిర్మించి ఇరువైపులా మూసివేసి మధ్యలో రంధ్రం పెట్టడంతో మరుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో ఆ వీధి ప్రజలు దోమల బారినపడి ఆరోగ్యాలు చెడిపోతున్నాయని, కాల్వ నిర్మించి మా ఆరోగ్యాలు కాపాడాలని కోరుతున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదికలో రెండు పర్యాయాలు వినతి పత్రాలు ఇచ్చినా అధికారులు రావడం చూసి వెళ్లడం తప్ప ఎలాంటి స్పందన లేదని బాధితులు అంటున్నారు. ఆ ప్రాంతంలో 200 అడుగుల లోపలనే మూడు కల్వర్టులు ఏర్పాటు చేశారు. ఆయన కాలువ నిర్మించకుండా అడ్డుపడటంతో అధికారులు ఏమి చేయలేని పరిస్థితిలో రోడ్డును తవ్వి పైప్‌లైన్ ద్వారా మురుగునీరు మా ఇంటివైపునకు కలుపుతామని చెబుతున్నారని తెలిసింది. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మా ప్రాంతంలో పర్యటించి ఈ సమస్యను పరిశీలించి రోడ్డును పగలగొట్టకుండా కాలువను నిర్మించి మా ఆరోగ్యాలను కాపాడాలని ఆ వీధి ప్రజలు కోరుతున్నారు.





రోడ్డుపై పారుతున్న మురుగునీరు

దోమలతో ఆరోగ్యాలు పాడుతున్నాయి

ఉమాదేవి భరత్ నగర్




భరత్ నగర్‌లో మా ఇంటి ముందు మురుగు నీరు రోడ్డుపై నిలిచి తీవ్ర ఇబ్బందులు గురవుతున్నాం. నీరు పోవడానికి దారిలేక నిలిచిపోవడంతో రోడ్డుపై నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. నా పిల్లల ఆరోగ్యాలు పాడవుతున్నాయి. సార్ మురుగునీటి కాలువ ఒక వైపే ఉంది. ఇంకో వైపు లేదు. మా సమస్యను పరిశీలించి కాల్వను నిర్మించి పరిష్కరించాలని కోరుతున్నాను.

కాల్వను నిర్మించి సమస్య పరిష్కరించాలి

చెన్న రాయుడు, పవన్ ,వీధి ప్రజలు





కమిషనర్ మా సమస్యను కళ్ళారా చూసి మురుగు కాలువ నిర్మించి పరిష్కార మార్గం చూపనట్లయితే మా ప్రాంత వాసులంతా కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

23న కలెక్టరేట్ వద్ద మెప్మా ఆర్‌పిల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పెండింగ్ వేతనాలు చెల్లించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రేడింగ్ విధానం రద్దుచేయాలని ఈనెల 23న సోమవారం కలెక్టరేట్‌వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం(సిఐటియు) నాయకులు కోరారు. కర్నూలు సిటీ మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సమావేశం శనివారం కెకెభవన్‌లో నగర అధ్యక్షులు పి.రుద్రమ్మ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాకార్యదర్శి ఉమాదేవి, నగర కార్యదర్శి షభాన మాట్లాడుతూ ఆర్‌పిలకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారన్నారు. ఎస్‌హెచ్ జి ప్రొఫైల్ ను పూర్తి చేసిన సిఒ, సిఎంఎం లాగిన్ చేయాలని కొంతమంది సిఒలు వత్తిడి చేస్తున్నారని అన్నారు. పిడి వత్తిడి చేస్తున్నారని, హడావుడి గా చేయటం ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్ పై అవగాహన లేక పోవటం కారణంగా ఆర్పీల పై వత్తిడి ఒకవైపు, మరో వైపు వేతనాల రాలేదని ఆందోళనకు గురి కావడానికి మెప్మా అధికారుల వైఖరి కారణమని అన్నారు. ఇప్పటికి డిసెంబర్, మొదటి వారం 16, 17 అంటూ ఇపుడు నెలాఖరులోగా వేస్తారని చెప్పటం శోచనీయమని అన్నారు. ఆర్‌పిలకు అదనపు పని చెప్పరాదని, వేతనాలు గ్రేడింగ్ పద్ధతి కాకుండా నెలకు రూ.8,000 ఆర్‌పిల వ్యక్తిగత అకౌంట్లో వేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి ,వేధింపులు ఆపాలని ,పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లాకార్యదర్శి అంజిబాబు మాట్లాడుతూ ఆర్‌పిల కోరికలు న్యాయమైనవని,వారు చేసే ఆందోళనకు సిఐటియుగా సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో పొదుపు మహిళల మద్దతుతో ఉద్యమాలు నిర్మించి పాలకుల మెడలు వంచి సాధించుకోవాలని అన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు రాముడు, నగర కార్యదర్శి సాయి బాబా మాట్లాడుతూ ఐక్యంగా ధైర్యంగా ఆర్‌పిలు పోరాటాలతోస సాధించుకోవాలన్నారు. సోమవారం జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో ఆర్‌పిలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి-మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ మండల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి అన్నారు. శనివారం ఓర్వకల్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఎంపిపి తిప్పన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి పాల్గొన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలపై ఎలాంటి చర్చ లేకుండానే తూతూ మంత్రంగా సమావేశాన్ని ముగించేశారు. ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓర్వకల్లు అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుందన్నారు. పారిశ్రామిక వాడ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. త్వరలోనే ఇక్కడికి కొత్త పరిశ్రమలు కూడా రాబోతున్నాయన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలపై తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ విద్యాసాగర్, జడ్‌పిటిసి రంగనాథ్‌గౌడ్, ఆయా విభాగాల అధికారులు , టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై చర్చ కరువు

ఓర్వకల్లు మండల కేంద్రంగా జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చ లేవన్నతకు పోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో కొంతమంది మృత్యువాత పడ్డారు. ఇటీవల వారం రోజుల క్రితం ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు కూడా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలయ్యారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై చర్చ లేకుండానే సర్వసభ్య సమావేశాన్ని ముగించడం పట్ల పలువురు మండిపడుతున్నారు.


డిఎంహెచ్‌ఒగా పి.శాంతికళ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కడప జిల్లా జమ్మలమడుగులో డిప్యూటీ డిఎహెచ్‌ఒగా విధులు నిర్వహిస్తున్న శాంతికళ పదోన్నతి పై కర్నూలు డిఎంహెచ్‌ఒ గా నియమితులయ్యారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర క్యాన్సర్ ఆస్పత్రి సిఎస్‌ఆర్‌ఎంఒగా డాక్టర్ హేమ నలిని కర్నూలు లోని రాష్ట్ర క్యాన్సర్ ఆస్పత్రి సిఎస్‌ఆర్‌ఎంఒగా డాక్టర్ హేమ నలిని నియమితులయ్యారు. ఆమె కర్నూల్ జిజిహెచ్ లో డిప్యూటీ సిఎస్ ఆర్‌ఎమ్‌ఒగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది

టిబిపి కమిటీ ఉపాధ్యక్షులుగా హుస్సేన్

ప్రజాశక్తి - గోనెగండ్ల


అభినందనలు తెలుపుతున్న టిడిపి నాయకులు

తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ దిగువ కాలువ (ఎల్ఎల్‌సి) సాగునీటి సంఘం ఉపాధ్యక్షులుగా గోనెగండ్లకు చెందిన అయ్యగట్ల హుస్సేన్ సాహెబ్ అలియాస్ టమోటా హుస్సేన్ ఎన్నికయ్యారు. అయ్యగట్ల హుస్సేన్ ఈనెల 14న నిర్వహించిన సాగునీటి సంఘం ఎన్నికల్లో ఎల్ఎల్‌సి డిసి-86 కాలువ నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 17న నిర్వహించిన ఎన్నికల్లో ఎల్ఎల్‌సి గోనెగండ్ల సెక్షన్ డిసి-7 సాగునీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే బివి.జయ నాగేశ్వర రెడ్డి సహకారంతో శనివారం ఎల్ఎల్‌సి జలమండలి నిర్వహించిన కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు నీటి సంఘం ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎంపికైనట్లు టిడిపి మండల నాయకులు తెలిపారు. వారు మాట్లాడుతూ... ఎంతోమంది ఆశావహులు ఉన్నప్పటికీ పారదర్శకత కాదని ముస్లిం, మైనారిటీ వర్గానికి చెందిన సామాన్య రైతు టమోటా హుస్సేన్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆయకట్టు రైతులు, ముస్లిం, మైనారిటీల తరఫున ఎమ్మెల్యే బీవీకి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, తిమ్మారెడ్డి, రంగస్వామి నాయుడు, శ్రీధర్ నాయుడు, గౌండ్ల రహమతుల్లా, రమేష్ నాయుడు, మదీనా, లింగందిన్నె సుంకన్న, కొత్తింటి ఫక్రుద్దీన్, పిల్లిగుండ్ల జయపాల్ పాల్గొన్నారు.

దురుద్దేశంతోనే ఆరోపణలు

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని


ఆర్ఐతో మాట్లాడుతున్న రమేష్ యాదవ్

మున్సిపాలిటీలో తన పేరుతో ఎలాంటి ఖజానా లేదని, రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ ఆదోని ఇన్‌ఛార్జి రమేష్ యాదవ్ మండిపడ్డారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్షావలీతో ఆయన వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడారు. ఆస్తి పన్ను రూ.2 లక్షలకు పైగా మున్సిపాలిటీకి ఖజానా ఉన్నట్లు ఈనెల 18న మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఎమ్మెల్యే పార్థసారథి తనపై ఆరోపణ చేశారని తెలిపారు. తన పేరుపై అప్పు ఉన్నట్లు డిమాండ్ నోటీసు ఇచ్చి ప్లేసిచేయకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. రాజకీయంగా తన ఎదుగుదలను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని, పద్ధతి మార్చుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథిపై మండిపడ్డారు. పరువు నష్టం దావా వేస్తున్నామని, సంబంధిత అధికారులపై న్యాయ పోరాటానికి సన్నద్ధం అవుతున్నామని తెలిపారు. రమేష్ యాదవ్ పేరిట అప్పు లేదని, వంశీ చైతన్య నర్సింగ్ హోమ్ పన్ను మాత్రమే పెండింగ్‌లో ఉందని, డాక్టర్ ప్రసన్నకుమారి పేరుతో ఉందని మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్షావలి తెలిపారు.

ధ్యానంతో జ్ఞానం...

ప్రజాశక్తి - దేవనకొండ


ధ్యానం చేస్తున్న విద్యార్థులు

ధ్యానం ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవాలని రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ సంస్థ నిర్వాహకులు ఆకుల శివప్రసాద్, ఎఫ్ఆర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు [illegible], డివిఎంసి సభ్యులు కాకర్ల శాంతి కుమార్ తెలిపారు. రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఎఫ్ఆర్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి శనివారం ధ్యాన సాధన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో మానవ మనుగడకు, విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించడానికి ధ్యానం చాలా అవసరమని తెలిపారు. ధ్యానం వల్ల మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడుతుందన్నారు.

'సెయింట్ జాన్స్‌'పై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

అధిక ఫీజులు వసూలు చేస్తున్న సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. శనివారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘా నాయకులు వీరేష్ యాదవ్, శేఖర్, ఆఫ్రిది, రఘు, కృష్ణ మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల కంటే అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలు తీర్చలేనప్పుడు సర్వసభ్య సమావేశాలెందుకు..?

- సర్పంచులు భాస్కర్, అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోనప్పుడు సర్వసభ్య సమావేశాలు ఎందుకు నిర్వహిస్తారని వెలమకూరు, తెర్నేకల్ సర్పంచులు భాస్కర్, అరుణ్ కుమార్ ధ్వజమెత్తారు. శనివారం దేవనకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి లక్ష్మీదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా వెలమకూర్ సర్పంచి భాస్కర్ మాట్లాడుతూ... దేవనకొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నా.. వెలమకూరు పంచాయతీతో పాటు మజరా గ్రామాలు సింగాపురం, కూకటికొండ గర్భిణులు, బాలింతలు ఆరోగ్య సేవల కోసం తుగ్గలి ఆరోగ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తున్నారని తెలిపారు. అక్కడికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు గత రెండు సమావేశాల్లో మొరపెట్టుకున్నప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని చెప్పారు. తెర్నేకల్ సర్పంచి మాట్లాడుతూ... ప్రభుత్వం మంజూరు చేయనున్న గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారులు పొజిషన్ సర్టిఫికెట్ కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. పొజిషన్ ధ్రువ పత్రాలను ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు తీవ్ర నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని విమర్శించారు. అందుకు స్పందించిన తహశీల్దార్ లోకేశ్వరరావు మాట్లాడుతూ... ఇంటి పొజిషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటి స్థలాలు పరిశీలించి ఇస్తామని సమాధానం చెప్పారు. తెర్నేకల్ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ముందు కేటాయించిన స్థలాన్ని మార్పు చేసి మరో స్థలం కేటాయిస్తామని చెప్పి మూడు నెలలు గడుస్తున్నప్పటికీ స్థలాన్ని చూపించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచి సభ దృష్టికి తెచ్చారు. రెవెన్యూ డివిజనల్ అధికారితో చర్చించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు. ఉపాధి ఎపిఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ... ప్రభుత్వం ఉచితంగా పండ్ల మొక్కలను అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకొని పండ్ల తోటల ద్వారా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులకు వెళ్లాలని, పొలాల్లో మట్టికత్వలు, నీటి కుంటలు నిర్మించుకోవాలని తెలిపారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామస్థాయిలో పనిచేసే విఆర్ఒలు సచివాలయాల్లో మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారని, సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు వాపోయారు. తహశీల్దార్ సమాధానమిస్తూ... విఆర్ఒలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇఒఆర్‌డి సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ మురళీ విజయ్, విద్యుత్ ఇంజినీర్ రవీంద్ర, ఇన్‌ఛార్జి పిఆర్ ఇంజినీర్ ఉదయ్ కుమార్, ఎంఇఒలు నిర్మల, తిమ్మారెడ్డి, పశు వైద్యాధికారి వెంకటేష్, సిహెచ్ఒ భాగ్యలక్ష్మి శాఖపరమైన పనుల గురించి వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్

దోభీ పోస్టుల్లో రజకులనే నియమించాలి

- రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి వినతి


ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోభీ పోస్టుల నియామకాల్లో రజకులనే నియమించాలని రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి కోరారు. శనివారం కలెక్టర్ రంజిత్ బాషను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రజకుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు జారీ చేసిన జిఒ 27, జిఒ 6 అమలు గురించి వివరంగా కలెక్టర్‌తో చర్చించారు. రజక వృత్తిదారులను ప్రోత్సహించేందుకు సంఘం నాయకులు చేసిన కృషి ఫలితంగా 1996లో అప్పటి ప్రభుత్వం జిఒ 27ను విడుదల చేసిందని, ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని తెలిపారు. జిఒ ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న దోభీ పోస్టుల్లో రజకులను నియమించాలని కోరారు. ప్రభుత్వాస్పత్రుల్లో, పోలీసు శాఖలో, ఇతర ప్రభుత్వ శాఖల్లో బెడ్ షీట్లు, యూనిఫారం శుభ్రం చేసే పనుల టెండర్లు వేసే అవకాశం రజకులకు మాత్రమే కల్పించాలని తెలిపారు. కలెక్టర్ రంజిత్ బాష స్పందించి జిఒ 27 అమలుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సావిత్రి

ఈరన్న స్వామి సన్నిధిలో మంత్రి భరత్


ఆలయ ప్రాంగణంలో ఉన్న మంత్రి భరత్

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ దర్శించుకుని పూజలు చేశారు. శనివారం పుణ్యక్షేత్రానికి చేరుకున్న పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్‌కు దేవాలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో పూజలు చేసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, ఉరుకుంద ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ చెన్న బసప్ప మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. టిడిపి నాయకులు కురుగోడు, సిద్ధు, రమేష్ గౌడ్, దొడ్డన గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

మాజీ ముఖ్యమంత్రి, వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలోని ఆయన స్వగృహంలో కరతాళ ధ్వనుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలతో మహిళా నాయకురాలికి తినిపించారు. ఎలాంటి హంగు, ఆర్భాటం లేకుండా ప్రశాంతంగా జరిగిన జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు గురించి ఎమ్మెల్యే మాట్లాడారు. శ్రేయోభిలాషుల అభిమానంతో జగన్మోహన్‌రెడ్డి ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. **ఆదోని (రూరల్) :** అధికారంలో లేనప్పటికీ ఎక్కడా తగ్గని అభిమానం జగన్మోహన్ రెడ్డిపై ఉందని, ఒకవేళ జెమిలి ఎన్నికలు వస్తే తమ తడాఖా చూపిస్తామని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ తెలిపారు. వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజకీయాల్లో ఒక కొత్త ఒరవడిని తీసుకొచ్చిన జగన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఇంట్లోనూ కుటుంబసభ్యుడుగా ప్రజల ప్రేమాభిమానాలను సొంతం చేసుకున్న ప్రజానాయకుడు జగన్ అని కొనియాడారు. **చిప్పగిరి** మండలంలోని నేమకల్లు గ్రామంలో సర్పంచి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి కేక్ కట్ చేసి వైసిపి నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే విరుపాక్షికి సర్పంచి ప్రేమ్ కుమార్, వైసిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికి.. పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. విరుపాక్షి మాట్లాడుతూ... జగనన్న హయాంలో ప్రతి నిరుపేదకూ పథకాలు అందించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని తరగతుల వారికి నష్టం జరుగుతోందన్నారు. జగన్ ఉంటే ఏదో ఒక పథకం అందించేవారని లబ్ధిదారుల అంటున్నారన్నారు. ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని, రాబోయే కాలం తమదేనని తెలిపారు. మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని వైసిపి నాయకులకు, కార్యకర్తలకు మనోధైర్యం కల్పించారు. కోకన్వీనర్ సత్తిరెడ్డి, ఎంపిటిసిలు సుంకన్న, భీమ లింగ పాల్గొన్నారు. **ఆలూరులో** ఎమ్మెల్యే బి.విరుపాక్షి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, వైఎస్ఆర్ విగ్రహానికి, అంబేద్కర్, వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు శశికళ కృష్ణ మోహన్ పాల్గొన్నారు. **పెద్దకడబూరులో** వైసిపి ఆధ్వర్యంలో జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి స్వగృహం నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, వైఎస్ అభిమానులు ఆర్‌టిసి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపిపి రఘురామ్, దొడ్డిమేకల సర్పంచి చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు. సర్పంచులు ఇస్మాయిల్, హనుమంతు, వైస్ ఎంపిపి ఇర్ఫాన్ దేశాయ్, ఎంపిటిసి వెంకటేష్, ఉప సర్పంచులు హుస్సేని, హనుమప్ప, మాజీ ఎంపిటిసి కెపి.ఎల్లప్ప, వైసిపి నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, నవీన్ రెడ్డి, నరవ రాజశేఖర్ రెడ్డి, శివరామరెడ్డి, ముక్కరన్న, మూకిరెడ్డి, మహదేవ, షేర్ ఖాన్ పటేల్, పరమేష్, అర్లప్ప, అళ్లయ్య, ఆంజనేయులు, ఈరన్న, భీమన్న, నరసింగప్ప, నారాయణ గౌడ్, వెంకటేష్, హనుమంతు, నాగరాజు, మొట్రు దస్తగిరి, బారుసబ్బు అనిల్, ప్రసాద్, ఏసన్న, కొరవ సుందరం, కోతి పెద్దయ్య, బసన్న పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బుట్టా నీలకంఠ, వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర వీర శైవ లింగాయత్ అధ్యక్షులు రుద్ర గౌడ్‌లు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి భారీ జనసందోహం మధ్య కేక్ కట్ చేశారు. బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. బుట్టా ఫౌండేషన్ తరఫున ప్రభుత్వాస్పత్రికి 200 కుర్చీలు, బెడ్ షీట్లు పంపిణీ చేశారు.




ఆదోనిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


రాంపురం (మంత్రాలయం)లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే


చిప్పగిరి : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి, ప్రేమ్ కుమార్


ఆలూరులో


పెద్దకడబూరులో కేక్ తినిపిస్తున్న ప్రదీప్‌రెడ్డి


ఎమ్మిగనూరులో

అత్యాచారం కేసులో నిందితుని అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు

ప్రజాశక్తి - ఆస్పరి




మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు కురువ జోగి హనుమంతును శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సిఐ మస్తాన్ వలీ తెలిపారు. ఆయన వివరాల మేరకు... మండలంలోని ముత్తుకూరు గ్రామంలో గతనెల 17న జొహరాపురం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళను ముత్తుకూరు గ్రామానికి చెందిన కురువ జోగి హనుమంతు ఆదోనిలోని అనాథాశ్రమంలో చేర్పిస్తానని మహిళ తల్లిదండ్రులతో నచ్చచెప్పి తీసుకొచ్చి ముత్తుకూరులోని ఇంట్లో బంధించి అత్యాచారానికి పాల్పడ్డాడు. కర్నూలు రోడ్డులో ముత్తుకూరు గ్రామానికి వెళ్లే బస్ స్టాప్ దగ్గర హనుమంతును అరెస్టు చేసినట్లు తెలిపారు.

'సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలి'

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని 26వ వార్డు పరిధిలోని రాజాసాబ్ నగర్‌లో రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని వార్డు కౌన్సిలర్ శాంతి భర్త మల్లికార్జున కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైల్వే లైన్ సమీపంలో కాలనీ ఏర్పడి 20 ఏళ్లు గడిచిందని తెలిపారు. ఇటీవల కొంతమేర డ్రైనేజీ నిర్మించామని, రోడ్డు లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాలనీని సందర్శించి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయించాలని కోరారు. కాలువలు పూర్తి కాకపోవడంతో ఇళ్ల మధ్యలో నీరు నిలిచి దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. గతంలో బోరు ఉండేదని, ట్యాంకు లేకపోవడంతో బోరు నిరుపయోగంగా మారిందని చెప్పారు. ట్యాంకు నిర్మించి బోరును ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. త్వరలోనే ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ హామీఇచ్చారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మల్లికార్జున

పంటల సాగులో జాగ్రత్తలు పాటించండి

- బనవాసి కేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్ర

ప్రజాశక్తి - చిప్పగిరి

మిరప పంట సాగు విషయంలో రైతులందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బనవాసి కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త రాఘవేంద్ర, హార్టికల్చర్ అధికారి ఇందిరా రైతులకు సూచించారు. శనివారం ఏరూరు, దేగులపాడు గ్రామాల్లో మిరప పంట సాగు చేస్తున్న రైతులతో కలిసి మిరప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, కృత్రిమ ఎరువులు వాడడం అలవాటు చేసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేయించి, అందుకు తగ్గట్లుగా ఎరువులను వాడి అధిక దిగుబడులను సాధించాలని రైతులను కోరారు. ముఖ్యంగా పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. పంట మార్పిడి తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు. నీరు నిల్వ లేకుండా బయటకు పంపాలని తెలిపారు. మిరపను సాగు చేసే సమయంలో పంట ఎండబెట్టకు గురికాకుండా చూసుకోవాలన్నారు. మిరప పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న, సజ్జ వంటి పంటను చివరి సాలల్లో సాగు చేయాలన్నారు. డ్రిప్ పద్ధతిలో మొక్కలకు సాగునీరు అందించాలని తెలిపారు. దీని ద్వారా పురుగు ఉధృతని అరికట్టవచ్చని చెప్పారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు వంశీకృష్ణ, సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.



మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరులోని బాయ్స్-2 మైదానంలో నిర్వహించిన సూపర్ సెవెన్ క్రికెట్ సెలక్షన్ పోటీల్లో హత్తిబెళగల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. ఆలూరు తాలూకా పాఠశాలల నుంచి వచ్చిన క్రికెట్ క్రీడాకారుల్లో జిల్లాస్థాయి సూపర్ సెవెన్ సెలక్షన్ కమిటీలో భాగంగా తమ పాఠశాల నుంచి కె.రియాజ్, ఎస్.నజీర్ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల కడపలో జరిగే రాష్ట్రస్థాయి సూపర్ సెవెన్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు ఖాసీం, బసవరాజు, వలీ, నరహరి, శంకరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు చిన్నబాబు అభినందించారు.


అభినందిస్తున్న ఉపాధ్యాయులు


సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

అభివృద్ధి పనులతో మారుతున్న రూపు రేఖలు

- టిడిపి సీనియర్ నాయకులు నాగిరెడ్డి

ప్రజాశక్తి - చిప్పగిరి

కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో అభివృద్ధి పనులతో గ్రామాల రూపరేఖలు మారుతున్నాయని టిడిపి సీనియర్ నాయకులు నాగిరెడ్డి, లక్ష్మన్న తెలిపారు. శనివారం నగరడోన పంచాయతీ మజరా గ్రామమైన తిమ్మాపురంలో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వంలో అప్పుడు ఇన్‌ఛార్జీగా ఉన్న వీరభద్ర గౌడ్ సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయని, మళ్లీ కూటమి ప్రభుత్వం రాకతో ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. తమ గ్రామానికి సహకారం అందిస్తున్న ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రంగస్వామి, మోహన్, రాజు, అనిల్, అన్వర్, విశ్వనాథ్, కృష్ణ పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో ప్రమాద హెచ్చరిక ఏర్పాటు

ప్రజాశక్తి - ఆదోని

ఎవరూ ప్రమాదాల బారిన పడకూడదని తన వంతు కృషి చేస్తానని లారీ డ్రైవర్ తిక్కన్న తెలిపారు. శనివారం ఆదోనిలోని కొత్తబస్టాండ్ సమీపంలోని ఆస్పరి రోడ్డులో స్పీడ్ బ్రేకర్‌కు ప్రమాద హెచ్చరిక సూచికలు సొంత ఖర్చులతో ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా తిక్కన్న మాట్లాడారు. తాను వృత్తిరీత్యా లారీ డ్రైవర్‌ను అని, స్పీడ్ బ్రేకర్ తెలియక చాలామంది బైక్‌పై వెళ్లేవారు అదుపుతప్పి కిందపడిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఇక్కడ ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. సొంత ఖర్చుతోనే వైట్ కలర్‌తో ప్రమాద సూచిక ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

- తహశీల్దార్ నజ్మా భాను



హాలహర్విలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - హాలహర్వి

రైతు సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నజ్మా భాను తెలిపారు. శనివారం హాలహర్విలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రెవెన్యూ సంబంధిత సమస్యలను తక్షణమే పరిష్కరించుకునే వీలుంటుందని తహశీల్దార్ నజ్మా భాను తెలిపారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. సర్పంచి మల్లికార్జున, ఆర్ఐ మహేష్ గౌడ్, మండల సర్వేయర్ భార్గవి పాల్గొన్నారు. **హోళగుంద** మండలం మార్లమడికి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ సతీష్ మాట్లాడుతూ... గ్రామంలో మొత్తం 13 దరఖాస్తులు భూ సమస్యలపై, శ్మశాన వాటిక కోసం, భూసర్వే, కుల ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్, తదితర పత్రాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు సర్పంచి ఎంకప్ప పాల్గొన్నారు.


హోళగుందలో మాట్లాడుతున్న అధికారులు

ప్రేమ వివాహానికి అండగా ఉంటాం

- జిల్లా డిఇఎఫ్ అండ్ జెఎసి అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - నందవరం


వధువరులను ఆశీర్వదిస్తున్న నాయకులు

వికలాంగురాలి ప్రేమ వివాహానికి అండగా ఉంటామని జిల్లా వికలాంగుల సాధికారత ఫోరం (డిఇఎఫ్) అండ్ జెఎసి అధ్యక్షులు బీవీ.నాగరాజు తెలిపారు. జిల్లా డిఇఎఫ్ కార్యవర్గం, కోడుమూరుకు చెందిన డాక్టర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నందవరం మండలం గురజాల గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం గూడూరు మండలం పొన్నకల్లు గ్రామానికి చెందిన వికలాంగురాలు బోయ వెంకటేశ్వరమ్మకు, బెళగల్ మండలం సంగాల గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బోయ తలారి మద్దిలేటితో ప్రేమ వివాహం చేశారు. వారు ఒకరినొకరు ఇష్ట పడడంతో దగ్గరుండి వివాహం చేసినట్లు తెలిపారు. బోయ మద్దిలేటి వెంకటేశ్వరమ్మను ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని చెప్పారు. డాక్టర్ మహేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు, డిఇఎఫ్ సభ్యులు వి.నరసింహులు, ఎస్.వెంకటేష్, బి.కేశన్న, సురేష్, గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణి పుట్టినరోజు వేడుకలు


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలో నారా బ్రాహ్మణి పుట్టినరోజు వేడుకలను టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక గాంధీ పార్కులో నారా బ్రాహ్మణి కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నందమూరి, నారా కుటుంబాల వారసత్వాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తూ వ్యాపార రంగంలో తనదైన ముద్రతో నవతరం మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న నారా బ్రాహ్మణికి శుభాకాంక్షలు అని తెలిపారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు ఆమె మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సాగునీటి సంఘం ఛైర్మన్ బసవరాజు, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ సాలే సాబ్, మండల మాజీ కన్వీనర్లు తిమ్మన్న, శ్రీనివాస్ గౌడ్, ఎంపిటిసి రహింతుల్లా, మాజీ ఎంపిటిసి శివ కుమార్, టిడిపి యువ నాయకులు సతీష్ కుమార్, యుగంధర్, రాజ్‌కుమార్, టిడిపి నాయకులు మల్లి స్వామి, వీరేష్, నాగలింగ, అంపయ్య, ఈశ్వర్, తెలుగు యువత నాయకులు మారేష్ పాల్గొన్నారు.